



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేవాదాయ శాఖ భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

దేవాదాయ శాఖలో కొత్త పథకాలు

● శంకుస్థాపన చేసిన స్టాలిన్



చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.190.40 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఆ శాఖ ఆధ్వర్యంలో వివిధ దేవాలయాల్లో రూ.42.75 కోట్ల నిధులతో పూర్తయిన పథకాలను కూడా ప్రారంభించారు. సచివాలయంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో 18 ఆలయాల్లో 25 కొత్త పథకాలు, 4 కార్యాలయ భవనాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. మదురై అళగర్‌కోవిల్‌లో రూ.49.25 కోట్లతో అభివృద్ధి, క్వార్టర్స్ నిర్మాణం, అరుణాచలేశ్వరాలయంలో రూ.44.57 కోట్లతో ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు, కుబేర లింగం సమీపంలో వాణిజ్య కాంప్లెక్స్ ఆలయగోపురాలు, విమాన గోపురాలకు విద్యుద్దీపాలంకరణ, ఏడు తీర్థకొలనుల మరమమ్మతు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా కోవై, తిరుప్పూరు జిల్లా పెరుమానల్లూరు కాళియమ్మన్ ఆలయం, తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సహా ఇలా పలు ఆలయాల్లో పనులకు స్టాలిన్ శంకుస్థాపన చేశారు. తిరువేర్కాడు కరుమారియమ్మన్ ఆలయం సమీపంలో, విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళమ్మన్ ఆలయంలో నిర్మించిన వాణిజ్య సముదాయాలను కూడా సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.చంద్రమోహన్, హిందూ దేవాదాయశాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్ డాక్టర్ ఇరా సుకుమార్, చీఫ్ ఇంజనీర్ పి.పెరియసామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కుటుంబీలకు రూ.10లక్షల సాయం...

సచివాలయంలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాద సంక్షేమ నిధి నుంచి మృతి చెందిన 10 మంది న్యాయవాదుల కుటుంబీకులకు తలా రూ.10లక్షల చొప్పున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నగదుసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖమంత్రి ఎస్.రఘుపతి, ఎంపీ, సీనియర్ న్యాయవాది పి.విల్సన్, తమిళనాడు, పుదుచ్చేరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పిఎస్ అమల్‌రాజ్, భారతీయ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.ప్రభాకరన్, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులు వర్ష సూచన

● వాతావరణ శాఖ వెల్లడి



వర్షంలో చెన్నై వాసుల ఇక్కట్లు

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడుకు సమీపంలో బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉన్న కారణంగా ఈ నెల 16వ తేదీ వరకు వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అలాగే, అదే ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఈ నెల 16 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. చెన్నై, పరిసర ప్రాంతంలో రాత్రిపూట వర్షాలు కురుస్తున్నాయి. ఇపుడు బంగాళాఖాతంలో ఏర్పడే ఉపరితల ఆవర్తన ద్రోణి, అల్పపీడన ప్రభావంతో పాటు గత రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మాత్రం మైలాడుదురై, కారైక్కాల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో విద్యా సంస్థలకు సెలవు ఇచ్చారు. అలాగే, కడలూరు, అరియలూరు, పెరంబలూరు జిల్లాల్లో మాత్రం కేవలం పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు. చెన్నై నగరంలో కూడా తేలికపాటి వర్షం కురిసింది.అలాగే, కోయంబత్తూరు, ఈరోడ్ వంటి పశ్చిమ జిల్లాలతో పాటు డెల్టా జిల్లాలు, తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో కూడా మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



నేడు 27 జిల్లాలకు వర్ష సూచన

ఈ అల్పపీడనం కారణంగా గురువారం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, విల్లుపురం, కడలూరు, తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదురై, పుదుక్కోట, శివగంగై, రామనాథపురం, నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూరు, దిండిగల్, మదురై, విరుదునగర్, తేని, తెన్‌కాశి, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారితో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

నిరుపేదలకు నివాస గృహాలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు



చెన్నైలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో భాగంగా నిరుపేదలకు, ప్లాట్‌ఫామ్‌లపై నివసిస్తున్నవారి కోసం 1476 నివాసగృహాలను నిర్మిస్తున్నట్లు సీఎండీఏ ఇన్‌చార్జి మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న గృహ సముదాయాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. విల్లివాక్కం శివశక్తికాలనీలో జరుగుతున్న కొళత్తూరు అక్వేరియం బిజినెస్ కాంప్లెక్స్ పనులు, అయనవరం యునైటెడ్ ఇండియా నగర్ ప్రాంతీయ గ్రంథాలయాన్ని, స్టాన్లీ ఆస్పత్రి సమీపంలో జలవనరుల శాఖకు చెందిన డిపో, వాల్‌టాక్స్ రోడ్డు, తన్నీర్‌తొట్టివీధి, అన్నాపిళ్లై వీధిలో నిర్మిస్తున్న నివాసగృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విల్లివాక్కం శాసనసభ్యుడు వెట్రి అళగన్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉషా, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్షుల్ మిశ్రా, మత్స్య శాఖ కమిషనర్ ఇరా గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభంలో విమర్శలు ఎదుర్కొన్నా..



● కీర్తి సురేష్

చిన్న చిత్రాలు.. భారీగా లాభాలు



'మహారాజ'లో విజయ్ సేతుపతి



7లో

పర్యావరణ పరిరక్షణపై కళాత్మక ఉత్సవాలు

టీవీకేలో బూత్ కమిటీల ఏర్పాటు

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శాఖలు ఏర్పాటుచేసి బూత్ కమిటీలను నియమించేందుకు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా టీవీకేతో జతకట్టే ఇతర పార్టీల నాయకులు, ప్రజలు, ముఖ్యంగా యువతతో ఆయన సమావేశం కానున్నట్లు సమాచారం. అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే తదితర పార్టీల ఓటు బ్యాంక్ పెరగడానికి కారణమైన బూత్ కమిటీ నిర్వాహకులలాగే టీవీకేలో కూడా ఆ కమిటీలను తయారుచేసి ఇప్పటినుంచే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న వారితో శిక్షణ ఇప్పించాలని విజయ్ నిర్ణయించినట్లు తెలిసింది. ఫిబ్రవరిలో తన రాజకీయ ప్రయాణం ప్రారంభించిన విజయ్, తాజాగా విల్లుపురం జిల్లా విక్రవాండిలో నిర్వహించిన పార్టీ మహానాడు విజయవంతం కావడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 6.23 కోట్ల మంది ఓటర్లుండగా, గత పార్లమెంటు ఎన్నికల్లో 4.34 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోని వారు విజయ్ పార్టీలో సభ్యులుగా చేరేందుకు ఉత్సాహంగా ముందుకొస్తున్నారని, పార్టీ సభ్యత్వాన్ని బాగా పెంచే దిశగా విజయ్ పావులు కదుపుతున్నట్లు ఆ పార్టీ పెద్దలు చెబుతున్నారు.

వ్యక్తిగత దూషణలు వద్దు..

ఇదిలా ఉండగా పార్టీని తీవ్రంగా విమర్శించే రాజకీయ పార్టీల నేతలను వ్యక్తిగతంగా దూషించవద్దని టీవీకే నేత విజయ్ పార్టీ శ్రేణులకు ఆదేశించారు. విమర్శలు ప్రత్యర్థుల్లో మార్పులు కలిగించేలా ఉండాలే తప్ప, వారిలో ఆగ్రహాన్ని రెచ్చగొట్టే రీతిలో ఉండకూడదని, ఈ విషయంలో పార్టీ ప్రముఖులు, నాయకులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ ప్రకటించిన సిద్ధాంతాలను గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలని, ఇతర పార్టీల నేతలు దూషించినా పట్టించుకోకూడదని తెలిపారు. టీవీకే నేతలు, కార్యకర్తలు హుందాగా వ్యవహరిస్తున్నారనే మంచి పేరు సంపాదించుకోవాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.



డాక్టర్ బాలాజీ తల్లి, కుటుంబీకులను పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఎం.సుబ్రమణ్యం

గిండి ఆస్పత్రిలో దారుణం.. వైద్యుడిపై కత్తితో దాడి

● యువకుడి అరెస్టు



ఆస్పత్రిలోకి వెళ్తున్న ఉదయనిధి, మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిండీ కలైంజర్ ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ జగన్నాథన్‌పై ఓ యువకుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. క్యాన్సర్ విభాగంలో ఆరునెలల పాటు చికిత్స పొందిన కాంచన అనే రోగి కుమారుడు విఘ్నేష్ తన తల్లికి సరైన వైద్యం చేయలేదని ఆరోపిస్తూ వైద్యుడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది.

సీఎం దిగ్భ్రాంతి..

గిండి ప్రభుత్వాసుపతి డాక్టర్ బాలాజీపై జరిగిన దాడి పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించారు. ఆ మేరకు తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం వెలువరించారు. గిండి ఆస్పత్రిలో డాక్టర్ బాలాజీపై ఓ రోగి కుమారుడు కత్తితో దాడి జరిపినట్లు తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీకి మెరుగైన చికిత్సలందించమని ఆదేశాలిచ్చానని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నిరంతరం చికిత్స అందించే వైద్యుల సేవలు నిస్వార్థమైనవని, విధి నిర్వహణలో వైద్యులకు మరింత భద్రత కల్పించే దిశగా ప్రభుత్వ యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్త వహిస్తామన్నారు.

డిప్యూటీ సీఎం పరామర్శ..

ఇదిలా ఉండగా కత్తిపోట్లకు గురైన డాక్టర్ బాలాజీ, ఆయన కుటుంబీకులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పరామర్శించారు. గిండి ఆస్పత్రికి వెళ్ళి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న బాలాజీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అక్కడే ఉన్న బాలాజీ తల్లి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ తర్వాత ఆసుపత్రి వెలుపల ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బాలాజీ తలపై 4 చోట్లా, భుజంపైనా, చెవి వద్ద కత్తిపోటు గాయాలయ్యాయని, వైద్యులు ఆయనకు మెరుగైన చికిత్సలందిస్తున్నారని తెలిపారు. ఈ సంఘటనకు నిరసన సమ్మెపిలుపునిచ్చిన వైద్యుల సంఘాల నేతలతో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం చర్చలు జరుపుతారని తెలిపారు.

స్టాన్లీ ఆసుపత్రిలో...

స్టాన్లీ ఆస్పత్రిలో సైక్రియాటిస్ట్ డాక్టర్ హరిహరన్‌పై దాడి జరిగినట్లు వాషర్‌మెన్ పేట పోలీసులు తెలిపారు. డాక్టర్ హరిహరన్ వద్ద చికిత్స పొందుతున్న మానసిక రోగి ఉన్నట్టుండి ఆయనపై దాడి జరిపాడని తెలిపారు. ఆస్పత్రి డీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఈపీఎస్ సహా నేతల ఖండన..

గిండి ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి సహా పలువురు రాజకీయ నేతలు పాలకపక్షంపై విరుచుకుపడ్డారు. డీఎంకే పాలనలో ప్రభుత్వ డాక్టర్ ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పటానికి ఈ సంఘటనే నిదర్శనమన్నారు.



నిందితుడు విఘ్నేష్

పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, టీఎంసీ నేత జీకే వాసన్, డీఎండీకే నాయకురాలు ప్రేమలతా తదితర నేతలు కూడా గిండి ఆసుపత్రి ఉదంతంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ప్రకటనలు జారీ చేశారు. చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీని మాజీ మంత్రులు డి.జయకుమార్, డాక్టర్ విజయభాస్కర్ తదితరులు పరామర్శించారు.

సరైన చికిత్స చేయనందువల్లే డాక్టర్‌పై కోపం

● విఘ్నేష్ తల్లి కాంచన



చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిండి ఆస్పత్రిలో తనకు సరైన చికిత్స అందించకపోవడం వలనే తన కుమారుడు డాక్టర్‌పై కోపంతో కత్తితో దాడి చేసి ఉంటాడని విఘ్నేష్ తల్లి కాంచన పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన దాడిని తాను సమర్థించడం లేదన్న ఆమె అక్టోబరు 14 నుండి 16 వరకు డాక్టర్ బాలాజీ వద్ద చికిత్స తీసుకున్నానని, ఉదయమే వెళ్ళినా సాయంత్రం వరకూ చికిత్స చేయకుండా జాప్యం చేసేవారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రిలో తాను ఎక్కువ కాలం బ్రతకనని డాక్టర్లు చెప్పడంతో విగ్నేష్ మరింత దిగులు చెంది, డాక్టర్‌పై దాడి చేసి ఉంటాడని తాను భావిస్తున్నట్టు తెలిపారు.

తమిళ సాహితీవేత్త రాజ్ గౌతమన్ కన్నుమూత

● సంతాపం తెలిపిన సీఎం స్టాలిన్



రాజ్‌గౌతమన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మైదీన్‌ఖాన్, ఎమ్మెల్యే ఎన్.మాలైరాజా



రాజ్ గౌతమన్ (ఫైల్‌ఫోటో)

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహితీవేత్త ఆచార్య రాజ్‌గౌతమన్(74) బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో పాటు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఇంటిపట్టునే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు పాళయంకోటలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజ్‌గౌతమన్ అసలు పేరు ఎస్. పుష్పరాజ్, విరుదునగర్ జిల్లా పుదుపట్టిలో 1950 ఆగస్టు 25న ఆయన జన్మించారు. పాళయంకోట సెయింట్ జవేరీ కళాశాలలో విద్యనభ్యసించి జంతుశాస్త్రంలో పట్టా పొందారు. ఆ తర్వాత తమిళ సాహిత్యంలో పీజీ చేశారు. పుదుచ్చేరి కారైక్కాల్ ప్రభుత్వ కళాశాలలో, ఠాగూర్ కళాశాలలో తమిళ అధ్యాపకుడిగా సేవలందించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన రచనలు పండిత పామరులను ఆకట్టుకున్నాయి. సాహితీవేత్తగా, సాంస్కృతిక పరిశోధకులుగా పేరుగడించారు. రాజ్‌గౌతమన్ మృతి తమిళ సాహితీ లోకానికి తీరనిలోటని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం ప్రకటించారు. గౌతమన్ మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు, సాహితీ మిత్రులకు ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు.

20న డీఎంకే హైలెవల్ కమిటీ సమావేశం

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న డీఎంకే ఉన్నతస్థాయి (హైలెవల్) కమిటీ సమావేశం ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరుగనుంది.ఈవిషయంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి దురైమురుగన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.అధ్యక్షుడు స్టాలిన్ నేతృత్వంలో పార్టీ ఉన్నతస్థాయి సమావేశం 20వ తేదీ బుధవారం ఉదయం 10.30గంటలకు తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరుగుతుందని, ఉన్నతస్థాయి కమిటీ సభ్యులంతా హాజరుకావాలని తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు వాటర్ కెనాల్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో బుధవారం కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంత్యుత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. కార్తీక శుద్ధ ద్వాదశి రోజున సరస్వతీ నదీతీరాన అవతరించిన వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని పురస్కరించుకొని ఆశ్రమంలో ఉదయం మహా అభిషేకం, క్షీరాభిషేకం, మహాగణపతి, మహాలక్ష్మి, నవగ్రహ, మృత్యుంజయ, సుదర్శన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 11.30 గంటలకు పూర్ణకుంభ కలశ పూజ, గోవిందమాంబ సమేత బ్రహ్మేంద్రస్వామి వార్లకు పంచామృతం, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి 16 రకాల పూలతో అలంకరించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు వీరబ్రహ్మేంద్రస్వామి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాతోలు వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, ట్రస్టీలు ఎన్.కిషోర్, కె.సీతారాం శర్మ, బీఎస్ రావు తదితరులు అన్నతీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

విజయ్ బలమెంతో ఎన్నికల్లో తెలుస్తుంది?

● శశికళ

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీని స్థాపించిన సినీ హీరో విజయ్ బలం ఎంతో 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుస్తుందని అన్నాడీఎంకే బహిష్కృతురాలు శశికళ అభిప్రాయపడ్డారు. ఆమె బుధవారం తిరుచ్చెందూరు ఆలయానికి వెళ్లారు. చెన్నై నుంచి తూత్తుకుడికి విమానంలో వచ్చారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాలు సర్వసాధారణంగానే ఉన్నాయన్నారు. విజయ్ ప్రజాబలం వచ్చే ఎన్నికల్లో తెలుస్తుందన్నారు.

పెరిగిన సీఎన్‌జీ వాహనాల సంఖ్య

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంధనం ఖర్చులు తగ్గించే దిశగా, రాష్ట్రంలో 'కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్' అనే సహజ వాయువుతో నడిచే వాహనాల సంఖ్య అధికమైంది. ఇండియన్ ఆయిల్ సంస్థ తిరువళ్లూర్ జిల్లా ఎన్నూర్ హార్బర్‌లో సీఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటుచేసి, విదేశాల నుంచి ఈ సహజ వాయువును దిగుమతి చేసుకుంటోంది. ఈ గ్యాస్‌ను ఇళ్లకు పైపుల ద్వారా 'పీఎన్‌జీ', వాహనాలకు 'సీఎన్‌జీ' పేరుతో సరఫరా చేస్తోంది. ప్రస్తుతం చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, నాగపట్టణం తదితర జిల్లాల్లో 335 కేంద్రాల ద్వారా సీఎన్‌జీ విక్రయాలు చేపట్టారు. 2030వ సంవత్సరంలోపు రాష్ట్రవ్యాప్తంగా 2,785 విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో, ప్రస్తుతం 57,000 ఆటోలు, 40,000 కార్లు, 1,500 బస్సులు, 8,000 సరుకు వాహనాలు, 350 ద్విచక్రవాహనాకు సీఎన్‌జీతో పనిచేస్తున్నాయని, రాబోయే కాలంలో సీఎన్‌జీ వాహనాల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

గ్రూప్-4 పోస్టులకు 21వ తేదీలోగా సర్టిఫికెట్ల నమోదు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పోస్టులకు ఈ నెల 21వ తేది సర్టిఫికెట్లు నమోదుచేయాలని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రూప్-4 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షకు 15.80 లక్షల మంది హాజరుకాగా, గత నెల 28న ఫలితాలు వెల్లడయ్యాయి. తొలుత వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8,932 పోస్టులకు అదనంగా మరో 559 చేర్చి మొత్తం 9,491 పోస్టులు భర్తీ చేస్తారు. పరీక్షల్లో అర్హత సాధించిన వారి వివరాలు ఈ నెల 7వ తేది విడుదల చేసిన టీఎన్‌పీఎస్సీ, అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 21వ తేది వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని, చివరి రోజు అని భావించకుండా, అభ్యర్థులు ముందుగానే సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని సూచించింది.

చెన్నై పోలీస్ కమిషనరేట్‌లో గ్రీవెన్స్

వేళచ్చేరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 27 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలను సత్వరం విచారించి చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

వేళచ్చేరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా తారాపురం సమీపంలో 17 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వార్డన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే, ఈ విషయమై ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థులపై చేయిచేసుకున్న చీఫ్ హాస్టల్ సూపరింటెండెంట్ రాంబాబు, స్కూలు ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ఓటరు శిబిరాలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

వేలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై సమీక్షా సమావేశం జరిగింది. గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సూపర్‌వైజర్ ప్రకాష్ సమావేశమై, వారి సలహాలు తీసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్యన్, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవీంద్రన్, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యన్, ఎన్నికల తహసీల్దార్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. మేట్టూరు డ్యాంకు మంగళవారం సెకనుకు 4,992 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు, బుధవారం 5,451 ఘనపుటడుగులకు పెరిగింది. డెల్టా సాగుకు డ్యాం నుంచి సెకనుకు 5,000 ఘనపటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 106.10 అడుగులు (డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు) నీరుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రేపు సూళ్లూరుపేట, నెల్లూరు మెము రైళ్లు పాక్షిక రద్దు

వేళచ్చేరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట మధ్య రైలుమార్గంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం సూళ్లూరుపేట, నెల్లూరు వెళ్లే మెము రైళ్లు కొన్ని పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా రద్దయినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రద్దయిన మెము రైళ్లు...

- నెం.06741 మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 5.15 గంటలకు సూళ్లూరుపేటకు వెళ్లే మెము రద్దు.
- నెం.06745 సూళ్లూరుపేట నుంచి ఉదయం 7.55 గంటలకు నెల్లూరు వెళ్లే మెము.
- నెం.06746 నెల్లూరు నుంచి ఉదయం 10.20 గంటలకు సూళ్లూరుపేటకు వెళ్లే మెము రైలు.
- నెం.06742 సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 12.35 గంటలకు మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ వెళ్లే సబర్బన్ రైలు రద్దు.

పాక్షికంగా రద్దయినవి...

- నెం.42401, నెం.42403 మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి తెల్లవారుజామున 4.15, 5 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్లు ఎలావూర్ వరకు మాత్రమే నడుస్తాయి.
- నెం.42405 సూళ్లూరుపేట నుంచి ఉదయం 6.45, 7.25 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్ బయల్దేరే రైళ్లు సూళ్లూరుపేటకు బదులుగా ఎలావూర్ నుంచి బయల్దేరనున్నాయి.

19న చెంగల్పట్టు జిల్లాలో అన్నాడీఎంకే ధర్నా

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా పరిధిలోని పుదువాంజేరి-మబ్బేడు జంక్షన్‌లో ఈ నెల 19వ తేది డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ధర్నా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... తాంబరం కార్పొరేషన్ పరిధిలోని మాడంబాక్కం ప్రాంతంలో సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూములు, అగరం పంచాయతీలో 22 ఎకరాల వ్యవసాయ భూములు, కోయిలాంజేరి గ్రామంలో 58 ఎకరాల వ్యవసాయ భూములను సీఎండీఏ కైవసం చేసుకొనే ప్రయత్నాలు చేపట్టినట్లు చెంగల్పట్టు జిల్లా యంత్రాంగం విడుదల చేసిన జీవో ద్వారా తెలిసిందని తెలిపారు. ఈ భూములు సాగు చేస్తున్న రైతులకు ద్రోహం తలపెట్టేలా డీఎంకే ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు ఖండిస్తూ చెంగల్పట్టు జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఈపీఎస్ తెలిపారు.

గ్యాస్ లీకైన పాఠశాల పునఃప్రారంభం

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో గ్యాస్ లీకైన కారణంగా మూతపడిన విక్టరీ పాఠశాల 18 రోజుల అనంతరం బుధవారం పునః ప్రారంభమైంది. గత నెల 25న పాఠశాల ప్రాంగణంలో గ్యాస్ లీకేజీ అవడంతో 45 మందికి పైగా విద్యార్థులు స్పృహ కోల్పోయారు. అనంతరం ఈ నెల 4వ తేది రెండోసారి గ్యాస్ లీకవడంతో 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సూచనల మేరకు పాఠశాలకు సెలవులిచ్చారు. ఈ నేపథ్యంలో, పాఠశాల ప్రాంగణంలో భవిష్యత్తులో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడకుండా భద్రత కట్టుదిట్టం చేసినట్లు పాఠశాల యజమాన్యం విద్యార్థులకు తల్లిదండ్రులకు హామీ ఇచ్చింది. మరోవైపు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు పాఠశాల ప్రాంగణంలో మకాం వేసి గ్యాస్ లీకేజీ కారణాలను ఇప్పటివరకు తెలుసుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో మట్టి ప్రమిద

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా గాంగేయం సమీపంలోని శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో మట్టి ప్రమిద ఉంచి పూజలు చేస్తున్నారు. మంగళవారం చేసిన ఈ పూజలతో సమాజంలో సమస్యలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయంలో ఆండన్ ఉత్తర్వుల పెట్టెను ప్రజాదరణ పొందిన అంశంగా భక్తులు నమ్ముతున్నారు. భక్తుల కలలో ప్రత్యక్షమైన వస్తువులను భక్తులు ఆలయానికి తీసుకెళ్లి ఆ పెట్టెలో ఉంచి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇప్పటివరకు ఈ ఆలయంలో మట్టి, తుపాకి, నాగలి, కరెన్సీ , నోటు పుస్తకం, సైకిల్, బియ్యం, పసుపు, కొబ్బరి బోండాం, బంగారం, చక్కెర, అకౌంట్ పుస్తకం, పూలదండ, ఇనుప సంకెళ్లు, రుద్రాక్షలు అని రకరకాల వస్తువులు ఉంచి పూజలు నిర్వహించడం గమనార్హం.

నకిలీ టీచర్లు పనిచేస్తున్నారనే వదంతులు నమ్మొద్దు

వేళచ్చేరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 10వేల మంది నకిలీ టీచర్లు పనిచేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని పాఠశాల విద్యాశాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో.. ధర్మపురి జిల్లా ఆరూర్ విద్యా జిల్లా కారిమంగళం యూనియన్ రామియాంపట్టి పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె.బాలాజీ తనకు బదులు బయటి వ్యక్తి పాఠశాల విధులకు పంపించారనే ఫిర్యాదుతో విచారణ చేపట్టి, టీచర్ బాలాజీని సస్పెండ్ చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 10వేల మంది నకిలీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారనే వార్తలను ప్రజలు నమ్మొద్దని, తమకు బదులుగా బయట వ్యక్తులను పాఠశాలకు పంపే టీచర్లపై కఠిన చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది.

ఓపీఎస్ సోదరుడి సహా ఆరుగురు విడుదల

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలయ పూజారిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన కేసులో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్ సెల్వం సోదరుడు ఓ.రాజా సహా ఆరుగురిని తేని జిల్లా కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. తేని జిల్లా పెరియకుళం సమీపంలోని టి.కల్లిపట్టికి చెందిన సుబ్బురాజ్ కుమారుడు నాగముత్తు (22) కైలాసపట్టిలోని కైలాసనాథర్ ఆలయంలో పూజారిగా పనిచేసేవాడు. షెడ్యూల్ కులాలకు చెందిన నాగముత్తుకు, ఓ.రాజాకు మధ్య చిన్న గొడవలున్నట్టు సమాచారం. దీంతో ఓ రోజున నాగముత్తుపై దాడి జరిగ్గా, 2012 డిసెంబరు ఏడో తేదీ నాగముత్తు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, తేని జిల్లా కోర్టులో విచారణ జరగ్గా ఈ కేసులో తుదితీర్పును బుధవారం వెలువరించారు. ఇందులో ఓ.రాజా సహా ఈ కేసులో ఆరో ఆరుగురు నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది.

మధ్యాహ్న భోజనం ఉద్యోగుల నిరాహారదీక్ష

వేలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ మధ్యాహ్న భోజనం పథక ఉద్యోగులు బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. కలెక్టరేట్ సమీపంలో జరిగిన దీక్షను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విల్వనాథన్ ప్రారంభించగా, నిర్వాహకులు తమిళ్‌సెల్వి, విజయలక్ష్మి, శశికళ, మహాలక్ష్మి, జిల్లా సెక్రటరీ ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.



నిరాహారదీక్షలో ఉద్యోగులు

రైల్వే ఎన్నికల ప్రచారం

వేలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ రైల్వేలో డిసెంబరులో కార్మిక సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఎస్ఆర్ఎంయూ సంఘ నేతలు బుధవారం కాట్పాడిలో రైల్వే అధికారులు, ఉద్యోగులను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు రాజాశ్రీధర్, కార్తికేయన్, వెంకటేశన్, విజయ్ జోసఫ్‌కుమార్, నరేష్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.



ప్రసంగిస్తున్న ఎస్ఆర్ఎంయూ నాయకులు

అన్నాడీఎంకే విజయానికి శ్రమించాలి

వేలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం కోసం శ్రమించాలని పార్టీ కార్యకర్తలకు మాజీ మంత్రి కేసీ వీరమణి పిలుపునిచ్చారు. గుడియాత్తంలో బుధవారం వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేసీ వీరమణి పాల్గొని, డీఎంకే అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేలూరు జిల్లా సెక్రటరీ వేల్ అయగన్, గుడియాత్తం నగర సెక్రటరీ పళని, నిర్వాహకులు వేలాయుధం, కలైసెల్వి, గోపాలకృష్ణన్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కేసీ వీరమణి

పెట్రోల్, డీజిల్ పొదుపుపై అవగాహన

వేలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ శాఖ గుడియాత్తం ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ ఏ విధంగా పొదుపు చేయాలనే విషయంపై అవగాహన వాహన ప్రచారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ నిర్వహణ ఇంజనీర్ వెంకటాచలపతి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అమ్ములు పాల్గొని ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందర్‌రాజన్, మున్సిపాలిటీ ఇంజనీర్ శ్రీనివాసన్, అసిస్టెంట్ నిర్వహణ ఇంజనీర్లు పెరుమాళ్, బాలకృష్ణన్, ముఖిల్ సహా పలువురు పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమ్ములు

సమాచార దృష్టి

నేడు 'బాలల గేయాలు' ఆడియో ఆవిష్కరణ

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల ప్రాంగణంలో 'బాలల గేయాలు' అనే పేరుతో రూపొందించిన ఆడియోను ఆవిష్కరించనున్నారు. ప్రముఖ బాలల గేయరచయిత, విద్యావేత్త టీవీ స్వామి గేయ రచన చేశారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ ఆడియో ఆవిష్కరణ కార్యక్రమానికి కెన్సెస్ సంస్థల అధినేత కె.నరసారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

18లోగా ప్రొఫెసర్ల బదిలీ దరఖాస్తులు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రొఫెసర్లు జనరల్ బదిలీ కౌన్సెలింగ్‌కు ఈ నెల 18వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సాంకేతిక విద్య కమిషనర్ టి.అబ్రహాం విడుదల చేసిన ప్రకటనలో... 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బదిలీ కోరే ప్రొఫెసర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పార్యాంశాల వారీగా ఖాళీ ప్రొఫెసర్ల పోస్టుల వివరాలు సాంకేతిక విద్య డైరెక్టరేట్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆ శాఖ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

హోంగార్డు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై హోంగార్డ్ విభాగంలో చేరేందుకు పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు 18 నుంచి 50 ఏళ్లలోపుండి 10వ తరగతి, దానికి సమానమైన విద్యార్హత కలిగి ఉండాలి. పగలు, రాత్రి గస్తీ, ట్రాఫిక్ విధులు చేస్తే రూ.500 ప్రత్యేక అలెవెన్స్ అందజేస్తారు. ఆసక్తి కలిగిన వారు సైదాపేట పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని హోంగార్డ్ కార్యాలయంలో దరఖాస్తుతీసుకుని డిసెంబరు23వ తేది సాయంత్రం 5 గంటల్లోగా నేరుగాను, తపాలా ద్వారా పంపించవచ్చని హోంగార్డ్ విభాగం తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లో 1.25 కోట్ల మొక్కలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో 1.25 కోట్ల మొక్కలు నాటే పనులు చేపట్టనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఇ.పెరియస్వామి తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటన లో... రాష్ట్రంలో పచ్చదనం పెంచేలా పలుచర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 1.25 కోట్ల మొక్కలు నాటనున్నామని, అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 825 ప్రాంతీయ నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నామని మంత్రి తెలిపారు.

3.50 లక్షల మందికి ఉద్యోగాలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించనున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా తెలిపారు. ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ కళాశాలలకు చెందిన 3.50 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంలో లబ్ధిపొందనున్నారని తెలిపారు. అలాగే, ఈ పథకంలో ఏడాదికి 14 లక్షల మంది చొప్పున మొత్తం 38 లక్షల మంది విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

రేపు బాలల దినోత్సవ వేడుకలు

వేళచ్చేరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నారు. శాంతోమ్ మహోన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు జరుగనున్న వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ పాల్గొంటారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, దివంగత మాజీ ప్రధాన జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో కత్తిపార జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి రాష్ట్ర మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారని సచివాలయం తెలిపింది.

24న జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు ఈ 24న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... అన్నాడీఎంకే వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు వానగరంలోని శ్రీ వెంకటాచలపతి ప్యాలెస్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల్లో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పళనిస్వామి పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో 'విద్యార్థి మనసు' ఫిర్యాదు పెట్టె

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులకు వ్యతిరేకంగా జరిగే లైంగిక వేధింపుల ఫిర్యాదుకు అన్ని పాఠశాలల్లో 'విద్యార్థి మనసు (మానవర్ మనసు)' పెట్టెలు ఏర్పాటుచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి మధుమతి విడుదల చేసిన ప్రకటనలో... పాఠశాలల్లో జరిగే లైంగిక వేధింపులపై విద్యార్థులు ఫిర్యాదు చేసేలా '14417', '1098' అనే టోల్ ఫ్రీ నెంబర్లు పరిచయం చేశామన్నారు. ఈ నెంబర్లను పాఠ్య పుస్తకాల చివరి పేజీలో ముద్రించడం జరిగిందన్నారు. అలాగే, విద్యార్థుల భద్రత కోసం 'విద్యార్థి భద్రతా సలహా కమిటీ' ఏర్పాటుచేశామని, ఈ కమిటీలోని సభ్యులు పోక్సో చట్టం సహా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

కరోనా బాధితుడి మృతదేహం వెలికితీసే అనుమతులపై స్టే

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరోనా బాధితుడి మృతదేహం వెలికితీసేందుకు, అతని స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇచ్చిన అనుమతులకు స్టే విధించారు. కరోనాతో మృతిచెందిన ఆస్టిన్ అనే వ్యక్తి మృతదేహాన్ని అంబత్తూర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ వ్యవహారంపై మృతుడి భార్య.. తన భర్త మృతదేహాన్ని వెలికితీసి ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు అనుమతించాలనే పిటిషన్‌ను విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి, గత సెప్టెంబరులో అందుకు అనుమతిలిచ్చారు. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ చెన్నై కార్పొరేషన్ తరపున మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌లో.. ఆస్టిన్ మృతదేహం తీసుకెళ్లేందుకు అనుమతిస్తే అనేక సమస్యలు వస్తాయని తెలిపింది. ఈ పిటిషన్ బుధవారం హైకోర్టు ప్రధానా న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి బాలాజీలతో కూడిన ధర్మాసనం విచారించి, సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది.

వ్యభిచారం చేస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్కంలో వ్యభిచారం చేస్తున్న ఇద్దర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు విభాగం పరిధిలోని వ్యభిచార నిరోధక విభాగం-1 పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం రాత్రి కీల్పాక్కం ఉమయాన్ వీధిలోని ఓ లాడ్జీలో తనిఖీ చేసి వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో తిరువణ్ణామలై జిల్లా పల్లిపట్టుకు చెందిన మణికంఠన్, కూత్తనూరుకు చెందిన విఘ్నేష్‌లను అరెస్ట్ చేసి, ఓ మహిళను ప్రభుత్వ హోంకు తరలించారు.

70 మంది కేరళ విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో ఉన్న ఓ హోటల్‌లో ఆహారం తీసుకున్న 70 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌కు కేరళ రాష్ట్రం త్రిశూర్ జిల్లాకు చెందిన 70 మంది విద్యార్థులు మంగళవారం వచ్చి ఏరిశాలైలోని ఓ హోటల్‌లో బసచేశారు. రాత్రి భోజనం చేసిన కొద్దిసేపట్లో 30 మంది విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడ్డారు. మరో గంట వ్యవధిలో మరో 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆరోగ్య శాఖ అధికారులు ఆ హోటల్‌లో తనిఖీలు చేపట్టారు.

కుముళి ప్రాంతంలో పులి సంచారం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుముళి ప్రాంతంలో పులి సంచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తేని జిల్లాను అనుకొని కేరళ రాష్ట్రానికి వెళ్లే ప్రధాన మార్గం కుముళి సమీపంలోని తేక్కడిలో పెరియారు పులుల శరణాలయం ఉంది. ఈ అటవీ ప్రాంతంలో పులులు, ఏనుగులు సహా పలు జంతువులున్నాయి. ఈ నేపథ్యంలో, తేని జిల్లా తమిళనాడు-కేరళ సరిహద్దు ప్రాంతం కంభం పశ్చిమ కనుమల్లోని కుముళి సమీపం 4వ మైలు ప్రాంతంలో జింక కళేబరం ఉందని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. అధికారులు అక్కడకు చేరుకొని జింక కళేబరాన్ని పరిశీలించి, పులి దాడిలో జింక మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో, ఆ ప్రాంతం, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులి ఆచూకీ కోసం గాలిస్తున్న అధికారులు, ఆ మార్గంగా వెళ్లే ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

గన్‌పాయింట్‌లో ముగ్గురు రౌడీల అరెస్టు

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు రౌడీలను పోలీసులు గన్‌పాయింట్‌లో అరెస్టు చేశారు. వీరిలో ఒకరు ఏ ప్లస్ క్రిమినల్ నేర చరిత్ర కలిగిన రౌడీ లెనిన్. ఇతడిపై చోమంగళం, తాంబరం, గూడువాంజేరి, అన్నానగర్, షోళింగనల్లూరు తదితర ప్రాంతాల్లో ఆరు హత్య, హత్యాయత్నం, దోపిడీ, కిడ్నాప్ ఇలా మొత్తం 27 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో రౌడీ లెనిన్ తన అనుచరులతో కలిసి తాంబరం - మీంజూరు ఔటర్ రింగ్ రోడ్డులో ఓ ఇంటిలో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రత్యేక బృందం ఆ ఇంటిని చుట్టుముట్టి అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, వారు పారిపోయేందుకు యత్నించారు. అయితే, పోలీసులు హెచ్చరిస్తూ గన్‌పాయింట్‌లో అరెస్టు చేశారు. అరెస్టు చేసిన మరో ఇద్దరిని లెనిన్ అనుచరులు నరేష్ బాబు (29), భరత్ (28)గా గుర్తించారు.

మెడికో ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ సమీపంలో వైద్య కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నామక్కల్ జిల్లా కుమారపాళయానికి చెందిన రిషికేష్ అనే మెడికో పోరూర్ ప్రాంతంలోని ఓ వైద్యకళాశాలలో చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, మంగళవారం రాత్రి రిషికేష్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ప్రేమ విఫలం కావడంతో రిషికేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం.

ఎన్నూర్ థర్మల్ కేంద్రంలో అగ్నిప్రమాదం

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నూరులోని థర్మల్ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఎన్నూరు రహదారి పక్కనే ఉండే ఈ థర్మల్ కేంద్రంలో విస్తరణ పనులు కొన్నేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. కానీ, ఈ పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో విద్యుత్ విడిభాగాలు నిల్వచేసిన ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పివేశాయి.

లైంగిక వేధింపుల కేసులో టీచర్‌కు 16 ఏళ్ల జైలు శిక్ష

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే నగర్‌లోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌కు 16 ఏళ్ల జైలుశిక్ష పడింది. ఈ ప్రాంతంలోని ఓ పాఠశాలలో రాజగోపాలన్ అనే టీచర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు వడపళని మహిళా పోలీసులు టీచర్ రాజగోపాలన్‌పై 2021లో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ కేసు చెన్నై పోక్సో కోర్టులో న్యాయమూర్తి ఎం.రాజ్యలక్ష్మి విచారిస్తున్నారు. వాదోపవాదాలు పూర్తయిన నేపథ్యంలో, 8 మంది విద్యార్థినుల వాంగూల్మం కూడా న్యాయమూర్తి పరిగణలోకి తీసుకొని, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు తలా రెండేళ్లు మొత్తం 16 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందారు. తిరువొత్తియూర్‌కు చెందిన విజిన్ (39), జయరిషిత (32) దంపతులు ద్విచక్రవాహనంలో మాధవరం వైపు వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై మాధవరం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో 75వేల మంది క్షయ రోగులు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది 75,800 మంది క్షయ వ్యాధి బారిన పడగా, వారిలో 4,000 మందికి పైగా మృతిచెందారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... క్షయ వ్యాధి రహిత తమిళనాడుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. క్షయ వ్యాధి బారిన పడిన వారి గుర్తించి వారిళ్లకే వెళ్లి చికిత్స అందించడంతో పాటు మూడు నెలలకు సరిపడా మందులు ఇస్తున్నామన్నారు. ప్రాథమిక దశలోనే క్షయ వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స అందించడం ద్వారా 84 శాతం మంది కోలుకుంటున్నారని తెలిపారు. మధుమేహం లక్షణాలున్న క్షయ వ్యాధిగ్రస్తులకు 'మక్కలై తేడి మరుత్తువమ్' పథకంలో చికిత్స అందిస్తున్నట్లు ఆరోగ్యశాఖ తెలియజేసింది.

చిత్రజ్యోతి

వీరసమర్‌కు లక్కీఛాన్స్

హీరోయిన్ అమలాపాల్ సరసన తొలి హీరోగా నటించిన వీరసమర్‌కు ఇపుడు మరో లక్కీఛాన్స్ వరించింది. ప్రముఖ హీరోయిన్ నయనతార చిత్రంలో నటించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ సాబు సిరిల్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తూ సినిమాల్లోకి అడుగుపెట్టిన వీరసమర్... అనేక హిట్ చిత్రాలకు సాబు సిరిల్‌తో కలిసి పనిచేశారు. ఆ తర్వాత ఆయన హీరోగా 'వీరశేఖరన్' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఇందులో అమలాపాల్ హీరోయిన్. ఈమె సరసన నటించిన తొలి హీరో వీరసమర్. ఆ తర్వాత 'కాదల్', 'వెయిల్', 'పూ', 'పాండి', 'పాండి', 'కొంబన్', 'కుడిమగన్', 'జాక్‌పట్' సహా 30కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో పలు చిత్రాలకు వీరసమర్ ఆర్ట్ డైరెక్టర్ కావడం గమనార్హం. ఇపుడు నయనతార 'మన్నాంగట్టి' అనే చిత్రంలో నటించే అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. అలాగే, ఇళయ బాల దర్శకత్వం వహించే సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విమల్ హీరోగా నటించే 'పరమశివన్ ఫాతిమా'లో కమెడియన్‌గా, పాండిరాజ్ దర్శకత్వంలో రూపొందే విజయ్ సేతుపతి 'వీజేఎస్ 49' మూవీకి ఆర్ట్ డైరెక్టరుగాను పనిచేస్తున్నారు. ఇదే చిత్రంలో ఓ ముఖ్య పాత్ర కూడా పోషిస్తున్నారు. కెరీర్ ఆరంభంలో చిన్న చిన్న పాత్రలు పోషించిన వీరసమర్ ఆ తర్వాత పెద్ద హీరోల చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించే స్థాయికి ఎదిగారు. కొన్ని చిత్రాల్లో రెండో హీరోగా కూడా నటించారు. నటనకు అధిక ప్రాధాన్యతనిచ్చే ఆయన ఆర్ట్ డైరెక్షన్‌ను నిర్లక్ష్యం చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. అలాగే, అగ్రహీరోలు, భారీ బడ్జెట్ చిత్రాల్లో కూడా అవకాశం దక్కించుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. మున్ముందు తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ నటుడుగా గుర్తింపు పొందుతాననే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



వీరసమర్

అప్పుడు అలా ప్రచారం చేశారు



● కీర్తి సురేష్

తాను చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన సమయంలో రాశిలేని హీరోయిన్, దురదృష్టవంతురాలు అంటూ పలు రకాలుగా ప్రచారం చేశారని అగ్రహీరోయిన్ కీర్తి సురేష్ వెల్లడించారు. కెరీర్ ఆరంభంలో తనకు ఎదురైన చేదు అనుభవాలను తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వివరించారు. 'నాకు తొలి సినిమా అవకాశం మలయాళంలో వచ్చింది. నేను కూడా మా తల్లిలాగే నటి కాబోతున్నానని తెగ సంతోషపడ్డాను. దురదృష్టవశాత్తు ఆ చిత్రం మధ్యలోనే ఆగిపోయింది. ఆ తర్వాత రెండు మూడు చిత్రాలకు కమిట్ అయ్యాను. నా అదృష్టమో, దురదృష్టమో ఏమో గానీ అవికూడా ఆగిపోయాయి. దీంతో నేను అదృష్టం లేని హీరోయిన్ అంటూ కామెంట్స్ మొదలుపెట్టారు. పైగా, నన్ను హీరోయిన్‌గా తీసుకుంటే ఆ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిపోతుందనే ప్రచారం చేశారు. ఆ తర్వాత క్రమంగా ఇండస్ట్రీలో నిలదొక్కుకుని జాతీయ అవార్డు సొంతం చేసుకున్నాను. ఇపుడు అనేక చిత్రాల్లో నటిస్తున్నప్పటికీ.. కెరీర్ ఆరంభంలో ఎదురైన పరిస్థితులను తలచుకుంటే ఒకవైపు బాధ, మరోవైపు నవ్వు తెప్పిస్తుంది' అని పేర్కొన్నారు.

మంత్రవిద్య నేపథ్యంలో 'అందనాల్'



'అందనాల్'లో ఆర్యన్ శ్యామ్

పిల్లిశూన్యం(మంత్రవిద్య) నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అందనాల్'. ఆర్యన్ శ్యామ్, ఆదియా ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించగా, ఇతర పాత్రల్లో ఇమాన్ అన్నాచ్చి, రాజ్ కుమార్ తదితరులు నటించారు. గ్రీన్ మేజిక్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాత రఘునందన్ నిర్మించగా, వీవీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి హీరో ఆర్యన్ శ్యామ్ వివరిస్తూ, 'ఇది పిల్లిశూన్యం నేపథ్యంలో తెరకెక్కిన హార్రర్ థ్రిల్లర్ మూవీ. టెక్నికల్‌గా చాలా బాగా వచ్చింది. అనేక అంతర్జాతీయ చిత్రోత్సవాలకు పంపించగా, ఆరు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకుంది. ఆ తర్వాత సెన్సార్‌కు పంపించగా, నరబలి, మంత్రశక్తులకు సంబంధించిన సన్నివేశాలుండటంతో ఆరు చోట్ల కట్స్ సూచించారు. దీంతో రీవైజింగ్ కమిటీకి వెళ్ళగా నాలుగు చోట్ల కత్తెర వేసి, ఏ సర్టిఫికెట్ మంజూరు చేశారు. సాధారణంగా హార్రర్ చిత్రాలంటే కామెడీ నేపథ్యంలో సాగుతాయి. కానీ, ఇది సీరియస్ మూవీగా సాగుతుంది' అన్నారు.

లాభాలు కురిపించిన చిన్నబడ్జెట్ చిత్రాలు



'మహారాజా'లో విజయ్ సేతుపతి

తమిళ చిత్రపరిశ్రమలో ఈ యేడాది ఇప్పటివరకు విడుదలైన చిత్రాల్లో అనేక చిన్న బడ్జెట్ చిత్రాలు హిట్ సాధించి, నిర్మాతలకు, బయ్యర్లకు లాభాల వర్షం కురిపించాయి. ఇలాంటి వాటిలో ప్రధానంగా విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ', మారి సెల్వరాజ్ జీవిత విశేషాలతో తెరకెక్కిన 'వాళై', హరీష్ కళ్యాణ్ నటించిన 'లబ్బర్ పందు' చిత్రాలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. అతి తక్కువ బడ్జెట్‌తో నిర్మించగా, ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఈ చిత్రాల కంటెంట్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ కావడంతో సూపర్ హిట్ చేశారు. ఫలితంగా భారీ కలెక్షన్లు రాబట్టి.. నిర్మాతలు, బయ్యర్లు, ఎగ్జిబిటర్లకు కూడా లాభాలు తెచ్చిపెట్టాయి. భారీ బడ్జెట్ చిత్రాలతో పోలిస్తే చిన్న బడ్జెట్‌తో విభిన్నమైన కంటెంట్‌తో కొత్త దర్శకులతో సినిమాలు తీసేందుకు నిర్మాణ సంస్థలు అమితాసక్తిని చూపుతున్నాయి. అదేవిధంగా రూ.300 నుంచి రూ.500 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన 'కల్కి-2898 ఏడీ', విజయ్ 'ది గోట్', కమల్ హాసన్ 'ఇండియన్-2', రజనీకాంత్ 'వేట్టయన్' వంటి చిత్రాలు కూడా నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టాయి.



'లబ్బర్ పందు'లో హరీష్ కళ్యాణ్ - అట్టకత్తి దినేష్

పర్యావరణ పరిరక్షణపై కళాత్మక ఉత్సవాలు





● విచిత్ర వేషధారణ, ఆటపాటలతో అలరించిన చిన్నారులు



చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెన్నై జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉత్సవాలలో ఎగ్మూరు ప్రెసిడెన్సీ బాలికల పాఠశాల చిన్నారులు చిత్రవిచిత్ర వేషధారణతో ఉపాధ్యాయులను, సందర్శకులను ఆకట్టుకున్నారు. పచ్చదనం నిండిఉన్న ఆ పాఠశాల ప్రాంగణంలో బాలికలు వన దేవతలుగా, వృక్షాలు, పుట్టగొడుగులు వంటి వేషాలు వేసుకుని అలరించారు. ఓ చిన్నారి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వేషధారణలో ప్రకృతిమాతను ఆరాధించేలా చేసిన నటన ఉపాధ్యాయులను అబ్బురపరచింది. ఇక బాలబాలికలు డప్పులతో చేసిన గ్రామీణ నృత్యం కూడా ఆనందాన్నిచ్చింది. పాఠశాల వేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన, గంపలు పట్టుకుని పల్లెపడుచులా అలంకరించుకుని చేసిన ప్రదర్శన కూడా మైమరపించింది. ఇక పూల దేవతల వేషధారణతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. అన్నింటికంటే జాలరి నృత్యనాటకం హైలెట్‌గా నిలిచింది.





అక్షయ పాత్రతో ఒప్పందం చాలా సంతోషం

▸▸ బీడబ్ల్యూ ఎల్పీజీ



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న దృశ్యం

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటి సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకోవడం ఎంతో సంతోషంగా ఉందని బీడబ్ల్యూ ఎల్పీజీ ఇండియా బోర్డ్ చైర్మన్ క్రిస్టియన్ సోరెన్‌సేన్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అక్షయ పాత్ర ఫౌండేషన్ కిచెన్లకు బీడబ్ల్యూ ఎల్పీజీ ఇండియా గ్యాస్ సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మాట్లాడుతూ, మెరుగైన ప్రపంచాన్ని సృష్టించేందుకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. దేశంలో ఎల్పీజీని సరఫరా చేయడంలో ప్రత్యేక గుర్తింపు పొందామని, ఇపుడు అక్షయ పాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్లకు తమ సంస్థ గ్యాస్‌ను సరఫరా చేస్తుందన్నారు. ది అక్షయ పాత్ర ఫౌండేషన్ చీఫ్ రిసోర్స్ మొబిలైజేషన్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ ధనుంజయ గంజూ మాట్లాడుతూ, బీడబ్ల్యూ ఎల్పీజీతో కుదుర్చుకున్న ఒప్పందంతో తమ కార్యకలాపాలు మరింతగా మెరుగుపడటమే కాకుండా సులభతరమవుతాయన్నారు.

జనవరి నుంచి రేషన్‌కార్డున్న మహిళలకు రూ.1000లు

▸▸ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్



మంత్రి రామచంద్రన్

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి నెల నుంచి రేషన్ కార్డులున్న గృహిణులకు కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం కింద ప్రతినెలా రూ.1,000లు అందజేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ ప్రకటించారు. విరుదునగర్ జిల్లా కంచనాయకన్‌పట్టిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గృహిణులకు రాష్ట ప్రభుత్వం ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందజేసే పథకం విజయవంతంగా సాగుతోందని, ఈ నిధులు అందని రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా, వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసిన ఉత్తర్వులు పొందిన వారికి కూడా త్వరలోనే ఆర్థిక సాయం అందజేస్తామన్నారు.

ఘనంగా ముత్తుపేటలో ఉరుసు ఉత్సవం

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా ముత్తుపేటలో ప్రసిద్ధిగాంచిన హకీమ్ షేక్ దావూద్ దర్గా ఆధ్వర్యంలో 723వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధం పాత్రను ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు హాజరయ్యారు. దర్గాలో అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, 2.30 గంటలకు దర్గా సీనియర్ ధర్మకర్త భాకర్ అలి సాహెద్ నేతృత్వంలో ట్రస్టీలు చందనం కలశాలను తలపై మోస్తూ గాజు పెట్టెలో ఉంచారు. బాణాసంచా కాల్పులు, మేళతాళాల మధ్య ప్రారంభమైన గంధ పాత్ర ఊరేగింపు అడకస్తం, బావా దర్గా, అమ్మ దర్గాల మీదుగా బుధవారం ఉదయం 5 గంటలకు తిరిగి దర్గా ప్రాంగణానికి చేరుకుంది. తిరువారూరు ఎస్పీ జయకుమార్ పర్యవేక్షణలో సుమారు 300 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చే 16వ తేది పతాక అవనతంతో ఉరుసు ఉత్సవాలు పూర్తవుతాయి.

సరస్వతీ మహల్‌ను సందర్శించిన గవర్నర్



ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశీలిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనతమిళ సాంస్కృతిక రాజధానిగా పేరొందిన తంజావూరులోని సరస్వతి మహల్‌ను గవర్నర్ ఆర్ఎన్ రవి సందర్శించారు. బుధవారం ఉదయం ఆయన చెన్నై నుంచి విమానంలో తిరుచ్చి వెళ్ళి, అక్కడి నుంచి కారులో ఉదయం 11.30 గంటలకు తంజావూరు నగరానికి చేరుకున్నారు. కాసేపు అక్కడి ప్రభుత్వ అతిథిగృహంలో విశ్రాంతి తీసుకున్న అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తంజావూరు రాజమహల్‌కు వెళ్ళారు. అక్కడే నివసిస్తున్న మరాఠీ చక్రవర్తుల కుటుంబీకులు ఆరాధించే చంద్రమౌళీశ్వరుడి సన్నిధికి వెళ్ళి పూజలు చేశారు. గవర్నర్‌కు రాజమహల్ దేవస్థాన ట్రస్టీ బాబాజా రాజా భోంస్లే, కుటుంబీకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ఆ తర్వాత గవర్నర్ సరస్వతీ మహల్‌కు వెళ్ళారు. ఆ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం, డీఎస్పీ ఆశీర్వాద్, శివాజీ రాజాభోంస్లే తదితరులు స్వాగతం పలికారు. ఆ తర్వాత తంజావూరు చరిత్ర, పర్యాటక స్థలాల డాక్యుమెంటరీని ఆయన తిలకించారు. సరస్వతీ మహల్‌లోని ప్రాచీన తాళపత్రాలు, అరుదైన గ్రంథాలు, చిత్రలేఖనాలు, ప్రాచీన యుద్ధ పరికరాలు తదితరాలను ఆసక్తిగా తిలకించారు. గవర్నర్‌తోపాటు ఆయన కుమారుడు రాహుల్ రవి కూడా ఉన్నారు. సుమారు గంటసేపు సరస్వతీ మహల్‌లో గడిపిన గవర్నర్ రవి తిరిగి ప్రభుత్వ అతిథిగృహానికి చేరుకున్నారు.



ప్రాచీన రాత ప్రతులు, గ్రంథాలను తిలకిస్తున్న గవర్నర్



వేలూరు జిల్లా అనైకట్టు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన కలెక్టర్ సుబ్బులక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న గత విద్యా సంవత్సరం టెన్త్, ప్లస్ టూ పరీక్షల్లో అధిక మార్కులు పొందిన విద్యార్థులు.



వేలూరు జిల్లా కేవీ కుప్పం పంచాయతీలోని ఓ కల్యాణమండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 122 మంది లబ్ధిదారులకు రూ.1.60 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల జాబితా విడుదల

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యో): రాష్ట్రంలో ప్లస్ వన్, టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు బుధవారం వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరం టెన్త్, ప్లస్ వన్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల జాబితాను సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 25వ తేది వరకు ఉన్నత, మహోన్నత పాఠశాలల అధ్యాపకులు ప్రభుత్వ పరీక్షల శాఖ వెబ్‌సైట్‌లో నమోదుచేశారు. ఈ జాబితా బుధవారం విడుదల చేశారు. పేర్లలో ఏవైనా సవరణలుంటే ఈ నెల 15 నుంచి 22వ తేదిలోగా చేపట్టాలని, ఆ గడువు ముగిసిన తర్వాత మరో అవకాశం ఇచ్చేది లేదని ప్రభుత్వ పరీక్ష శాఖ స్పష్టం చేసింది.

మ్యూజియం సందర్శకుల కోసం కొత్త రోబో



→ కొత్త రోబోను పరిచయం చేస్తున్న ప్రొఫెసర్ వి.కామకోడి, ప్రొఫెసర్ సి.రాజ్‌కుమార్ తదితరులు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ మ్యూజియంలను సందర్శించేందుకు వచ్చేవారికి సమగ్రమైన వివరాలు తెలిపేలా కొత్త రోబోను ఐఐటీ మద్రాసు, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ సంయుక్తంగా రూపొందించనున్నాయి.. భవిష్యత్తులో ప్రజానీకానికి భారత రాజ్యాంగ ధర్మాసనం వివరాలను తెలిపేలా ఈ రోబో స్థాయిని పెంచే దిశగా ఈ రెండు విశ్వవిద్యాలయాలు బుధవారం ఉదయం నగరంలోని స్టార్‌హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోడి, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.రాజ్‌కుమార్, ప్రొఫెసర్ వెంకటేష్ బాలసుబ్రమణియన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు రాష్ట్ర న్యాయవాదుల సంఘం సంక్షేమ నిధి నుంచి తలా రూ.10లక్షల ఆర్థికసాయం సచివాలయంలో అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న స్వీడన్ రాయబారి షేన్ తెస్లీఫ్ తదితరులు



తిరువిక నగర్ జోన్‌లోని ఒట్టేరి కాలువలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ప్రియా తదితరులు

ఆహారం కోసం ఎదురుచూస్తూ..



వాహనాల వైపు చూస్తూ నిలబడి ఉన్న దుప్పులు

● ఘాట్ రోడ్లపైకి వచ్చేస్తున్న దుప్పులు, జింకలు

వాహనాల్లో వెళ్లే వారు ఏమైనా పెట్టకపోతారా అన్నట్టుగా తిరుమల ఘాట్‌రోడ్డులో కొన్ని దుప్పులు, జింకలు ఎదురుచూస్తూ గడిపేస్తున్నాయి. సాధారణంగా వైల్డ్‌లైఫ్ చట్టాల ప్రకారం అడవి జంతువులకు మనుషులు ఫీడింగ్ ఇవ్వడం నిషేధం. ఇందులో భాగంగానే అలిపిరి మార్గంలో వచ్చే మార్గంలోని పార్కులో ఉన్న జింకలను కూడా టీటీడీ అధికారులు మూడేళ్ల క్రితమే అడవిలోకి విడిచిపెట్టారు. దీంతో కాలినడకన వచ్చే భక్తులు ఆహారం అందించే విధానం తగ్గింది. అయితే శ్రీవారి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యే భక్తులు జింకలను, దుప్పులను దగ్గరగా చూసేందుకు వాహనాలు ఆపి మరీ తమ వద్దనున్న వివిధ రకాల ఆహార పదార్థాలను పెడుతుంటారు. ఇలా చాలా వరకు దుప్పులు, జింకలు భక్తులు ఇచ్చే ఆహారం కోసం అలవాటు పడ్డాయి. దీంతో జింకలపార్కు సమీపంలో ఉన్న రోడ్డుపైకి తరచూ జింకలు, దుప్పులు వచ్చేస్తున్నాయి. భక్తులు పెట్టే ఆహార పదార్థాల కోసం ఎదురుచూస్తూ కనిపిస్తున్నాయి. 'అడవి జంతువులకు ఫీడింగ్ ఇవ్వకండి' అంటూ బోర్డులు ఏర్పాటు చేసిన క్రమంలో చాలా మంది వెళ్లిపోతున్నారు. దీంతో జంతువులు మాత్రం రోడ్డు సమీపంలోనే ఉండిపోతున్నాయి. రోడ్డుకి సమీపానికి వస్తున్న ఈ జంతువులకు ఇబ్బంది లేకుండా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కొందరు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




తిరుమలలో కేజ్రీవాల్

ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శ్రీవారి దర్శనార్థం బుధవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద ఆయనకు రిసెప్షన్ సిబ్బంది, పార్టీ నేతలు స్వాగతం పలికారు. గురువారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు ప్రపంచ డయాబెటిక్ డే





7 నెలలు.. 32 వేల మంది

'అడ్డంకులను బద్దలు కొట్టడం... అంతరాలను పూడ్చడం' ప్రపంచ మధుమేహ దినోత్సవం-2024 సందర్భంగా ప్రపంచ ఆరోగ్యసంస్థ నినాదమిది. డయాబెటిస్‌తో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ సమగ్రమైన, సరసమైన, నాణ్యమైన చికిత్స ఇవ్వాలనేదే దీని సారాంశం. కాగా, జిల్లాలో రోజు రోజుకు మధుమేహ బాధితులు పెరిగిపోతున్నారు గత ఏడు నెలల్లో 32,477 మంది కొత్తగా మధుమేహంతో బాధపడుతున్నట్టు అధికారిక లెక్క. దీంతో సంబంధం లేకుండా మరో పది వేల మంది ఉంటారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే దీనికి కారణంగా తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● జిల్లాలో పెరుగుతున్న మధుమేహ బాధితులు ● అనధికారికంగా మరో పది వేల మంది ఉండొచ్చని అంచనా



డయాబెటిక్ ఫుట్‌ను అశ్రద్ధ చేయొద్దు

మధుమేహ వ్యాధి అదుపులో లేని వారు ఫెరిఫెరల్ న్యూరోపతికి గురవుతుంటారు. కాళ్లలో సన్నటి నరాలు దెబ్బతిని రక్తప్రసరణ తగ్గి చిన్న అల్సర్ వస్తుంది. చెప్పుల వల్ల, చెప్పులు లేకుండా నడవడం వలన చిన్న దెబ్బలు ఏర్పడి పెద్దపుండులాగా మారిపోతుంటాయి. న్యూరోపతి వలన స్పర్శ తెలియకుండా ఎండాకాలంలో కాళ్ల వేడికి బొబ్బలు వచ్చి అల్సర్‌గా మారుతుంది. తొలిదశలో చికిత్స చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ఎముకలు దెబ్బతినడం వలన వేలు తీసేసే పరిస్థితి వస్తుంది. సెప్టిక్ ఎక్కువైనప్పుడు కాళ్లకూడా తీసేయాల్సి ఉంటుంది. చెప్పులు మెత్తగా ఉండేవి వాడాలి. చెప్పులు లేకుండా బయట నడవకుండా ఉండడం మంచిది. షుగర్ వ్యాధి ఉన్నవాళ్లలో 6శాతం మంది వరకు డయాబెటిక్ ఫుట్‌తో బాధపడుతుంటారు. కాళ్లలో రక్తప్రసరణ సరిగ్గా ఉందోలేదో చూసుకోవాలి. డాప్లర్ అల్ట్రా సౌండ్ సులభంగా చేసుకునే మార్గాలు ఓపీలో అందుబాటులోనే వచ్చాయి. అదే డ్రెస్సింగ్ మెటీరియల్‌కూడా స్టైరిల్, నాణ్యమైనవి ఉన్నాయి. అందువల్ల కాళ్లకు గాయాలు ఉన్నట్టుగుర్తించిన వెంటనే తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు.

- డాక్టర్ హరినాథ రెడ్డి, సీనియర్ జనరల్ సర్జన్, హర్షిత ఆస్పత్రి



సరైన ఆహారం, నడక తప్పనిసరి

మధుమేహం బయటపడ్డ నాటినుంచే మందులు మొదలుపెట్టడం తప్పనిసరి. ఇంకోసారి పరీక్ష చేసి చూద్దామంటూ తాత్సారం చేయరాదు. మందులతో పాటు ఆహార వ్యాయామ నియమాలూ పాటించాలి. మన దగ్గర మధుమేహం ఆలస్యంగా బయటపడుతుండటం, గుర్తించినప్పటి నుంచే చాలామందిలో ఏదో ఒక సమస్య కనిపిస్తోంది. జెనిటిక్ (కుటుంబ చరిత్ర), జీవనశైలిలో మార్పుల వలన మధుమేహానికి గురవుతున్నారు. రోజుకు 5వేల నుంచి 10వేల అడుగులు తప్పకుండా నడవాలి. తక్కువ కొవ్వు, తక్కువ పిండిపదార్థాలు, అధిక ప్రొటీన్, ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవడం అందరికీ చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉన్నవారు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. షుగర్ తక్కువగా ఉండే పండ్లు, బీన్స్, పప్పుధాన్యాలు, నట్స్, సీడ్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని విటమిన్ డీ మెరుగుపరుస్తుంది. గుడ్లు, ఫ్యాటీఫిష్, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో విటమిన్ డీ ఉంటుంది. అదేవిధంగా మెగ్నీషియం, జింక్, పొటాషియం, క్రోమియం కూడా షుగర్ నియంత్రణలో ఉండేందుకు తోడ్పడుతుంది. ఆకుకూరలు, నట్స్, కూరగాయలు, సీడ్స్, ధాన్యాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది.

- డాక్టర్ దుర్గాప్రసాద్, డయాబెటాలజిస్ట్, గాయత్రి ఆస్పత్రి



బహుమతులు అందుకున్న అమరరాజా సంస్థకు చెందిన 12 బృందాలు

'అమరరాజా'కు 12 బంగారు పతకాలు

రేణిగుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరరాజా సంస్థ అంతర్జాతీయ స్థాయిలో 12 బంగారు పతకాలను గెలుచుకుంది. బుధవారం శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన 49వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ పోటీల్లో 14 దేశాల నుంచి 800 బృందాలు.. 5వేల మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అమరరాజా సంస్థ లీడ్ యాసిడ్ బ్యాటరీ తయారీ, పవర్ కన్వర్షన్, ఉత్పత్తులు, ఇంజనీరింగ్, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ సర్వీసెస్, ఆహార ఉత్పత్తులు వంటి వివిధ రంగాల్లో 12 బృందాలు 12 బంగారు పతకాలు సాధించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని మాట్లాడుతూ... ఉమ్మడి లక్ష్యం దిశగా కలిసికట్టుగా పనిచేసినపుడే పూర్తిస్థాయి విజయాలు అందుకుంటామని దీనిని నిరంతరం నిరూపిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంపై చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులునాయుడు హర్షం వ్యక్తం చేశారు. తాము పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలకు ఈ విజయాలు నిదర్శనమని అమరరాజా సంస్థ పేర్కొంది.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించండి

ప్రసూతి ఆస్పత్రిలో అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాన్పుల కోసం వచ్చే గర్భిణులకు అన్ని సదుపాయాలతో కూడిన మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హోదాలో సభ్యులతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో నిత్యం రోగుల సేవలో ఉండే పీజీ వైద్యులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలు విషయాలకు సంబంధించి ఆయన కమిటీ సభ్యులతో చర్చించారు. జనరేటర్ మరమ్మతులకు గురవడంతో కాన్పులు, శస్త్ర చికిత్సలు చేసే సమయంలో విద్యుత్తు కోతల వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ చెప్పారు. కొత్త జనరేటర్ కొనుగోలుకు రూ. 14 లక్షలను కలెక్టర్ విడుదల చేశారు. మరమ్మతులకు గురైన వైద్య పరికరాలను బాగు చేయించాలని, అవసరమైతే కొత్తవి కొనుగోలు చేయడానికి నిధులను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు మౌర్య, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రవిప్రభ, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూరక్ష రాళ్లపై పేరు తొలగింపునకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పాతిన 3,98,872 భూరక్ష రాళ్లపై ఉన్న పేర్లను తొలగించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క రాయిపై పేరును తొలగించేందుకు రూ.15 చొప్పున టెండర్లు పిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 18వ తేదీలోపు తిరుపతిలోని జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 7075354941ను సంప్రదించాలని కోరారు.

జిల్లాలో ముసురు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం కూడా జిల్లాలో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు అడపదడపా వర్షం పడుతూనే ఉంది. దీంతో వాతావరణం చల్లబడింది. బుచ్చినాయుడుకండ్రిగలో 78.8మి.మీ., చిల్లకూరు 75.2, గూడూరు 68.8, దక్కిలి 57.2, రామచంద్రాపురం 54, తడ 51.4, కోట, దొరవారిసత్రం48.2, చిట్టమూరు 46.2, పిచ్చాటూరు 43.4, వడమాలపేట 43, బాలాయపల్లి 40.4, తిరుపతి రూరల్ 36.8, తిరుపతి అర్బన్ 35.4, రేణిగుంట 35.2 వర్షపాతం నమోదైంది.

ట్రాన్స్‌కో అదనపు ఎస్పీగా జనార్దననాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాన్స్‌కో అదనపు ఎస్పీగా జనార్దన నాయుడిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో ఏసీబీలో పనిచేసిన ఆయన్ను ప్రస్తుతం తిరుపతిట్రాన్స్‌కోలో నియమించారు.

నేటి నుంచి ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అర్హతలు, ఖాళీలు, ఫీజు వివరాల కోసం 9573589744లో సంప్రదించాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.



భాకరాపేట ఘాట్ రోడ్డులో లోయలో పడిన కారు

లోయలో పడిన కారు

● ఆరుగురికి గాయాలు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలో పడింది. ఈప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బళ్లారి నుంచి మోహన్‌బాబు, భార్య రేణుక అత్త అనంతమ్మ, పిల్లలు కిషోర్ బాబు, వనిత, మోక్షితలు మంగళవారం రాత్రి తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వస్తున్నారు. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే కారు అదుపు తప్పింది. రోడ్డు పక్క లోయలో పడింది. కారులో ఉన్న ఆరుగురికీ గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ఆటోలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్

విజేతగా ఎస్వీ వ్యవసాయ కళాశాల

ముగిసిన అంతర కళాశాలల క్రీడాపోటీలు

తిరుపతిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని అంతర కళాశాలల విద్యార్థులకు మూడ్రోజులపాటు నిర్వహించిన మొదటిదశ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల ఫైనల్స్‌లో ఆతిథ్య ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలచింది. బాస్కెట్‌బాల్‌లో శ్రీకాకుళం వ్యవసాయ కళాశాలపై, టేబుల్ టెన్నిస్‌లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టుపై ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టు రాణించి విజేతగా నిలిచిందని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవికాంత్ రెడ్డి పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జి.రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. సైబర్‌నేరాలు, మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. కాగా వివిధ క్రీడల్లో విజేతలుగా నిలచిన జట్లకు అవార్డులను ప్రదానం చేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పాల్గొన్నారు.



ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టుకు బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట తప్పదు



జేసీకి సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు నిలబెట్టేందుకు అహర్నిశలు పనిచేస్తున్న 108 సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెబాట తప్పదని 108 జిల్లా అధ్యక్షుడు మహేష్ తెలిపాడు. ఈ విషయంపై 108 సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిసి సమ్మె నోటీసు అందించారు. 108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే రాయితీలను కల్పించాలని కోరుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 108 జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల ప్రాణాలను రక్షించడంలో పనిచేసే తమకు జీతాలు కూడా సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికితోడు తమ నిర్వహణ బాధ్యతలను ప్రవేటు ఏజెన్సీలకు అప్పగించడం వలన ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ కూడా అందడం లేదన్నారు. వెంటనే తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ప్రభుత్వం కల్పించే అన్నీ రాయితీలను అందించాలన్నారు. లేకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళతామన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్‌ను కలిసి ఆయనకు కూడా సమ్మె నోటీసు అందించారు.



విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయితీపై విత్తనాల పంపిణీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయితీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వరి విత్తనాలు 7,500 క్వింటాళ్లు (ఆర్ఎన్ఆర్ 15048 రకం 3,800 క్వింటాళ్లు) (కేఎన్ఎం 1639రకం 3,700 క్వింటాళ్లు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు 4,102 క్వింటాళ్లు (కే-6రకం 2,800 క్వింటాళ్లు) (టీసీజీఎస్ 1694 రకం 1,302 క్వింటాళ్లు) 40 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మినుము విత్తనాలు 50శాతం రాయితీతో వీబీఎన్ 8 రకం 53 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 50శాతం రాయితీతో 18 క్వింటాళ్ల వైఎల్ఎం 66 రకం నువ్వులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కాగా, 80శాతం రాయితీతో కంటింజెన్సీ కింద వరి విత్తనాలు (కేఎన్ఎం1638రకం) 73.8 క్వింటాళ్లు రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు.

పన్ను చెల్లించని వాహనాలపై కొరడా

● జిల్లావ్యాప్తంగా 1,505 వాహనాలపై కేసు నమోదు



తిరుపతి (జీవకోన), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పన్నులు చెల్లించని ప్రైవేటు (ఎల్లోబోర్డు) వాహనాలపై రవాణా శాఖ కొరడా ఝళిపిస్తోంది. గడువు ముగిసినా పన్ను చెల్లించని వాహనాలపై కేసు నమోదు చేయాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లను జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశించారు. దీంతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. పన్ను చెల్లించిన వాహనానికి ఒక మాసం వెసలుబాటు ఇస్తారు. తదుపరి మాసంలో వాహనం పట్టుబడితే వంద శాతం, తర్వాత నెలలో అయితే 200శాతం జరిమానా విధిస్తారు. జిల్లావ్యాప్తంగా అక్టోబరులో 1,420 వాహనాలపై కేసులు నమోదు చేయగా రూ.1.5కోట్లు, ఈనెల 11వ తేదీ వరకు 85 వాహనాలపై కేసులు నమోదు చేయగా 11 రోజుల్లో రవాణా శాఖకు రూ.93లక్షలు ఆదాయం చేకూరింది.

సకాలంలో పన్నులు చెల్లించండి

ప్రైవేటు వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించేలా యజమానులు చొరవ తీసుకోవాలి. చెల్లించకుండా రోడ్లపై తిరిగితే జరిమానా తప్పదు. వాహనాల యజమానులు రవాణా శాఖ అభివృద్ధికి సహకరించాలి.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖ అధికారి